ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 వరంగల్
సోమవారం 19 మే 2025



నదీమాతకు దూపం వేస్తున్న కాశీ వేద పండితులు



మహదేవ్‌పూర్ - కాళేశ్వరం దారిలో బారులు తీరిన వాహనాలు

పుష్కర స్నానానికి పోటెత్తిన జనం

ఆదివారం సెలవు రోజు భక్తజన సందోహం

- కిటకిటలాడిన పుష్కరఘాట్, ఆలయ పరిసరాలు
- వరుసగా రెండో రోజూ కొనసాగిన వాహనాల రద్దీ
- 15 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- వన్‌వే ఏర్పాటు చేసి క్రమబద్ధీకరించిన అధికారులు
- ముక్తీశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నటుడు రాజేంద్రప్రసాద్

5



పుష్కరిణికి నారికేళంతో నమస్కరిస్తున్న యువతి

నదిలో పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు

నదీమాతకు దీపంతో యువతి పూజలు



తాడ్వాయిలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన దుర్గ

దూసుకొచ్చిన మృత్యువు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

- ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 25 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- తాడ్వాయి జాతీయ రహదారిపై ప్రమాదం
- వనదేవతల దర్శనానికి వచ్చి వెళుతుండగా ఘటన
- బాధితులది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారాంపురం గ్రామం



సీత మృతదేహం

4

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డును కాపాడాలి

- అన్ని మతాలు, కులాలతో అన్నదమ్ముల్లాగా ఉంటాం..
- ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

4



బహిరంగ సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఓవైసీ



ములుగు జిల్లా ఏటూరునాగారంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం



ఏటూరునాగారంలో తడిచిన మిర్చి

ఓ కాలమా.. ఇది నీ శాపమా..?!

"యాసంగిలో ఓ రైతు ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు.. కోతకు రావటంతో వరి ధాన్యాన్ని కోసి కొనుగోలు కేంద్రానికి తరలించాడు.. 17 శాతం తేమ వచ్చే వరకు కొనుగోలు కేంద్రంలో స్థలం లేక రోడ్డుపైనే ఆరబెట్టాడు. కాంటా సీరియల్ వచ్చే లోపే అకాలం వర్షం పడి ధాన్యం తడిసింది. మళ్లీ నాలుగు రోజులు ఎండబెట్టి శుక్రవారం కాంటా వేశాడు. కానీ, వెంటనే లారీలు లేకపోవటంతో మిల్లుకు ధాన్యాన్ని తరలించలేదు. ఇంతలోపే మళ్లీ భారీ వర్షం వచ్చి కాంటా వేసిన బస్తాలన్నీ తడిచిముద్దయ్యాయి. బస్తాల్లోని ధాన్యం మళ్లీ 17శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలని అధికారులు చెబుతున్నారు. దానికో వారం పదిరోజులు పట్టేలా ఉంది. ఇంతలో మళ్లీ వర్షం పడితే ఇక ఆగమాగమే.."

.. ఇది ఏ ఒక్క రైతు దీనగాథ కాదు.. వరి ధాన్యం సాగు చేసిన ప్రతీ రైతు ఎదు ర్కొంటున్న కన్నీటి కథ. ధాన్యం కొనుగో లు కేంద్రాల్లో రాత్రిళ్లు జాగారం చేస్తూ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు కర్షకులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

అన్నదాతను ముంచేస్తున్న అకాల వర్షాలు

- కల్లాల్లోనే తడుస్తున్న ధాన్యం, మొక్కజొన్న, మిర్చి
- కాంటాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు
- గన్నీబ్యాగులు, టార్పాలిన్‌లు, హమాలీలు, లారీలు లేక ఇక్కట్లు
- పంట విక్రయంలో ఉమ్మడి జిల్లా రైతాంగం అగచాట్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వడగళ్ల వాన నుంచి తేరుకోకముందే అన్నదాతలపై అకాల వర్షం పిడుగులా పడింది. ఐదారురోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో వరి ధాన్యాన్ని పండించిన రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇటీవల కాలంలో కురుస్తున్న వడగళ్ల వానకు రైతుల చేతికి వచ్చే పంట నీటిపాలవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, జనగామ జిల్లాల్లో భారీగా పంటలు వడగళ్ల వానకు చేతికి అందుకుండాపోయాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలవుతుంటే అన్నదాత కళ్లలో నీటి సుడులు తిరుగుతున్నాయి.


తూకంలో తరుగు.. రైతుకు బరువు..

మార్కెట్‌కు తీసుకువచ్చిన వరిధాన్యాన్ని కాంటా వేసేందుకు 15-20 రోజులు వరకు నిరీక్షించాల్సి వస్తోంది. చాలా కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత రైతులను వేధిస్తోంది. కొనుగోళ్ల నత్తనడకన సాగడానికి హమాలీలు, లారీలు, మిల్లర్లే ప్రధాన కారణంగా చెబుతున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు కొర్రీలు పెడుతున్నారు. వానలకు రంగు మారటంతో ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు ముఖం చాటేస్తున్నారు. దీంతోపాటు తూకంలోనూ రైతును దగా చేస్తున్నారు. ప్రతీ బస్తాకు రెండు, మూడు కిలోల వరకు తరుగు పేరుతో తోడేస్తున్నారు. ఇక మిల్లులకు ధాన్యం చేరగానే తాలు, తేమ పేరుతో నాలుగైదు కిలోలు కోత పెడుతూ రైతు కష్టాలకు వాత పెడుతున్నారు. దీంతో రైతులు నిండా మునుగుతున్నారు.

కల్లాల్లో జాగారం..

కాంటాలు ఆలస్యం అవుతుండటంతో అకాల వర్షాలు రైతు శ్రమను మింగేస్తున్నాయి. ధాన్యాన్ని కాంటా వేసేది హమాలీలే కావటంతో వారు కొనుగోలు కేంద్రాల్లో సరిపడా లేకపోవటంతో రోజుల తరబడి ధాన్యంతో రైతులు కాంటా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. అలాగే ధాన్యాన్ని మిల్లులకు

మిగతా 4వ పేజీలో...



భారీగా నష్టం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024-25 యాసంగిలో మొత్తం 6,60,699 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వీటిలో 2,46,802 ఎకరాల్లో వరి, 18,958 ఎకరాల్లో మొక్కజొన్న, 9,26,459 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు. కాగా, భూగర్భ జలాలు ఎండిపోవటంతో సుమారు 50వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. దీంతో రైతులు ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి నష్టపోయారు. దీంతో పాటు మార్చి 21 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు రైతులపై అకాల వర్షాలు విరుచుకుపడుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాల్లో సుమారు 12వేల ఎకరాల్లో పంట నష్టంవాటిల్లగా, అత్యధికంగా ములుగు జిల్లాలో అకాల వర్షాలకు 5,723 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. సుమారు రూ.5.66కోట్ల వరకు నష్టంవాటిల్లినట్లుగా అధికారులు అంచనా వేశారు.

20 రోజులుగా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు



ఎం.డి. దావూద్, రైతు, ఏటూరునాగారం

ఏటురునాగారం మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో 20రోజులుగా ధాన్యం నిల్వ ఉంటోంది. కొనుగోలు చేయకపోవటంతో అకాల వర్షాలకు ధాన్యం తడుస్తోంది. దాన్ని మళ్లీ ఆరబెట్టి తేమ శాతం రాగానే అమ్మకానికి వెళ్లితే కొనుగోలు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ క్రమంలో గత గురువారం వర్షానికి మళ్లీ ధాన్యం తడిచాయి. ఇలా 20 రోజులు గడుస్తున్నప్పటికీ కాంటా మాత్రం కావటం లేదు. ఇంటికి వెళ్లకుండా ఎప్పుడు వర్షం వస్తుందో అనే భయంతో ధాన్యానికి కాపలాగా రాత్రిళ్లు జాగారం చేస్తున్నాం.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- నాయిని ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయం
- ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ యువతను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన కుమారుడు విశాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాయిని టీ-10 లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలను వేం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులతో సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కుమారుడు 2015లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పటి నుంచి ఆయన పేరుమీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. గత పాలకుల హయాంలో కుంటుపడిన గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రికెట్‌తో పాటు కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్‌ను మరింత అభివృద్ధి చేసేలా ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుందన్నారు. 2030 నాటికి ఒలంపిక్ క్రీడలను తెలంగాణలో నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయిని టీ-10 లీగ్‌కు 100కు పైగా టీమ్‌లు పేర్లు నమోదు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నీ



క్రీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న వేంనరేందర్‌రెడ్డి

విజేత జట్టుకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, నాయిని కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య గొంతులను నొక్కుతున్న కేంద్రం

- ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య గొంతులను కేంద్ర ప్రభుత్వం నొక్కుతూ కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో మండల పదో మహాసభను సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు కామెర వెంకటరమణ, మర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల రాయితీలను ప్రకటిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. పేదల సంక్షేమం కోసం ప్రశ్నించిన గొంతులను అణచివేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తూ రచయితలు, కవులు, కళాకారులు, విద్యావేత్తలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శిం చారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలకు విద్య, వైద్యం అందకుండా పోతోందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, రాజ్‌కుమార్, మనోహర్, చంద్రమౌళి, రాజనర్సు, కుమారస్వామి, మోహన్‌రెడ్డి, విజయ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఓ కాలమా.. ఇది నీ శాపమా..?!



ములుగు జిల్లా ఏటూరునాగారంలో అకాల వర్షానికి తడిచిన ధాన్యం

(3వ పేజీ తరువాయి)

తరలించేందుకు సరిపడా లారీల్లేవు. మిల్లర్ల కొర్రీలతో మిల్లుల వద్దే లారీలు రోజుల తరబడి నిలిచిపోతున్నాయి. వీటికి తోడు కొన్నిచోట్ల గన్నీ బ్యాగుల కొరతతో ధాన్యం బస్తాలు కాంటాకు ఎక్కటం లేదు. కాంటాలు ఆలస్యం అవుతుండటంతో 17శాతం కంటే తక్కువ తేమ కోసం రైతులు ధాన్యాన్ని ఎండబెట్టాల్సి వస్తోంది. పొలాల్లో కల్లాలు లేకపోవటంతో కొనుగోలు కేంద్రాలు, రోడ్లపైన వరిధాన్యాన్ని ఆరబోస్తున్నారు. కలాల్లో ఆరబోసిన ధాన్యం తడిచి ముద్దవుతోంది. కొనుగోలు కేంద్రాల్లో చాలావరకు టార్పాలిన్ పరదాలు అందుబాటులో లేకపోవటంతో రైతులు ప్రైవేటుగా తెచ్చుకుంటున్నారు. లేదంటే అందుబాటులో ఉన్న పరదాలతో ధాన్యం కాపాడుకుంటున్నారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టి తన వంతు రాగానే కాంటాకు సిద్ధమవుతున్నారు. కాంటా పూర్తయినప్పటికీ మళ్లీ వానకు తడిస్తే రైతుదే బాధ్యత. మిల్లుకు చేరే వరకు రైతుపైనే భారం ఉండటంతో కాంటా వేసిన బస్తాల్లో ధాన్యం తడిస్తే మళ్లీ దాన్ని ఆరబెట్టి తూకం వేయాల్సిందే. ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టేందుకు హమాలీ చార్జీలు బస్తాకు రూ.25లు చెల్లించాల్సి వస్తోంది. వాటిని బస్తాల్లో నింపి తూకం వేసేందుకు మళ్లీ బస్తాకు రూ.25లు చెల్లించాల్సి ఉంది. ఇలా హమాలీలకే బస్తాకు రూ.50ల నుంచి రూ.75వరకు చెల్లించాల్సి రావటం రైతులపై ఆర్థిక భారం పడుతోంది. టార్పాలిన్ కవర్లను ప్రవేటుగా తెచ్చుకుంటే వాటికి రోజుకు రూ.100లు, పొలం నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్‌కు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు దూరాన్ని బట్టి చెల్లించాల్సి వస్తోంది. దీంతో రైతుపై సాగుభారం పడుతోంది. అంతేకాదు.. ధాన్యాన్ని ఎవరు దొంగిలించకుండా కాపాడుకునేందుకు రాత్రి కొనుగోలు కేంద్రాల వద్ద జాగారం చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. దీంతో భార్య, పిల్లలకు దూరంగా రోజుల తరబడి దూరంగా ఉంటున్నామని రైతులు వాపోతున్నారు. కేవలం ధాన్యం రైతులే కాకుండా మిర్చి, మొక్కజొన్న రైతులు సైతం వర్షాలకు తీవ్రంగా నష్టపోతున్నారు.

22 నుంచి పర్యాటక ప్రత్యేక రైలు

కాజీపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి కాజీపేట మీదుగా భారత్ గౌరవ్ పర్యాటక ప్రత్యేక రైలు నడుస్తుందని సౌత్ సెంట్రల్ జోన్ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, (అనంత పద్మనాభస్వామి ఆలయం), శ్రీరంగం, తంజావూర్ మొదలైన ప్రదేశాల మీదుగా వెళ్తుందన్నారు. ఈ ప్యాకేజీలో మూడు పూటలా భోజనం, రవాణా సౌకర్యం ఉంటుందన్నారు. భువనగిరి, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, విజయవాడ రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఉంది.

మరింత సమాచారం కోసం ఐఆర్‌సీటీసీ టూరిజం కం వెబ్‌సైట్ లేదా 9701360701, 9281030712, 9281030740 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.

చేపపిల్లల పంపిణీలో జాప్యం

ఎదురుచూస్తున్న మత్స్యకారులు



బాలసముద్రం, మే 18 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు ఉచితంగా అందజేసే చేపపిల్లల పంపిణీ ఈ యేడు కూడా జాప్యం జరిగేలా ఉంది. వందశాతం రాయితీతో అందించే చేప (పిల్లల) విత్తనాల పంపిణీ పథకంపై ఇప్పటివరకు ప్రభుత్వ పెద్దలు దృష్టిసారించినట్లు లేదు. కిందటేడు ఆలస్యంగా పంపిణీ చేయగా దిగుబడి రాలేదు. దీంతో మత్స్యకారులు నష్టపోయారు. ఈ యేడు అయినా సకాలంలో చేపపిల్లల విత్తనాలు సరఫరా చేయాలని వారు కోరుతున్నారు.

ఆలస్యం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీంతో రాష్ట్రంలో మత్స్య సంపద ఎంతగానో పెంపొందింది. మత్స్య సహకార సంఘాల్లో 6 లక్షల మందికి, పరోక్షంగా మరో 30 లక్షల మందికి ఉపాధి లభించేది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక కిందటేడు సకాలంలో చేపపిల్లలను సరఫరా చేయలేదు. అంతేగాక అవసరమైన చేపపిల్లల్లో 50 శాతం మాత్రమే మత్స్యకారులకు అందించింది. చేపపిల్లల పంపిణీకి టెండర్ ప్రక్రియను ఆలస్యంగా చేపట్టి అక్టోబరు నెలలో పంపిణీ చేశారు. జలాశయాల్లో నీరు చేరాక అక్టోబరు నెలలో చెరువుల్లో చేపపిల్లలను వదిలారు. సాధారణంగా జూలై, ఆగస్టు నెలల్లో చెరువుల్లో నీరు చేరుతుంది. సెప్టెంబరు నెలాఖరు వరకైనా చేపపిల్లల పంపిణీ పూర్తిచేస్తే చేపలు పూర్తిసైజులో పెరిగి మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. కిందటేడు ఆలస్యంగా చేపపిల్లల పంపిణీ చేపట్టిన రాష్ట్రప్రభుత్వం.. ఈ యేడు ఇప్పటి వరకు కూడా టెండర్ ప్రక్రియ చేపట్టలేదు. ఈ మే నెలలోనే టెండర్ ప్రక్రియ చేపడితే సకాలంలో చేపపిల్లల పంపిణీ సకాలంలో పూర్తవుతుంది.

అయోమయం

తెలంగాణ రాష్ట్రంలో చేపపిల్లల ఉత్పత్తి చేసే కేంద్రాలు అతితక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి చేపపిల్లలను తీసుకురావలసి ఉంటుంది. చేప పిల్లల కొనుగోలుకు ధర తక్కువ కాగా, రవాణా చార్జీలు ఎక్కువగా ఉంటాయి.ఒక్కొక్క వాహనంలో నీటితో నిండిన డ్రమ్ముల్లో ఆక్సిజన్ సరఫరా చేస్తూ రాష్ట్రానికి తీసుకురావడానికి సుమారు రూ.6వేలు ఖర్చు అవుతుంది. ప్రభుత్వం ఇంతవరకు పంపిణీపై దృష్టి పెట్టకపోవడంతో అసలు ఈ యేడు టెండర్లు ఉంటాయో.. లేదోనని మత్స్యకారులు అయోమయంలో ఉన్నారు. అంతేగాక గత సంవత్సరం చేప పిల్లలను సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదని తెలుస్తోంది. దీంతో సరఫరాదారులు కూడా నిరాశతో ఉన్నారు. ప్రభుత్వం వెంటనే పథకం అమలుపై దృష్టి సారించి సకాలంలో చేపపిల్లలను అందించాలని మత్స్యకారులు ఎదురు చూస్తున్నారు.

ఆదర్శ వివాహాలు సమానత్వాన్ని పెంచుతాయి

- సీపీఎం పొలిట్ సభ్యుడు బీవీ. రాఘవులు

మహబూబాబాద్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ వివాహాలు సమాజంలో సమానత్వాన్ని పెంచుతాయని సీపీఎం పొలిట్ సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం ఆయన ఆదర్శ వివాహం జరిపించారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్-నాగమణి దంపతుల ఏకైక కుమారుడు ఆకాష్‌కు, అదే పట్టణానికి చెందిన టీడీపీ అర్బన్ అధ్యక్షుడు బొమ్మ వెంకటేశ్వర్లు-రోజా దంపతుల ఏకైక పుత్రిక అమృత వర్షతో ఆదర్శ వివాహం దగ్గరుండి చేయించారు. స్థానిక పీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య అధ్యక్షతన, బీవీ రాఘవులు ఆధ్వర్యంలో ఆదర్శ పెళ్లి జరిపించారు. తల్లిదండ్రుల సమక్షంలో వధూవరులు ఆకాష్, అమృతవర్ష హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సంప్రదాయాలకు భిన్నంగా కమ్యూనిస్టు పద్ధతిలో దండలు మార్చుకుని, ప్రమాణ పత్రాలు చదివి సంతకాలు చేశారు. కాగా, ఆదర్శ వివాహం చేసుకున్న ఆకాష్, అమృతవర్ష దంపతులను రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, బండి పుల్లయ్య, మాజీ ఎమ్మెల్సీ గండు సావిత్రమ్మ, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి తదితరులు ఆశీర్వదించారు.



మహబూబాబాద్‌లో ఆకాష్, అమృతవర్షతో ఆదర్శవివాహం జరిపిస్తున్న సీపీఎం పొలిట్ సభ్యుడు బీవీ రాఘవులు

కొండా దంపతులవి రాజకీయ కక్ష సాధింపు చర్యలు

20 డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్



పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న కార్పొరేటర్ గుండేటి నరేందర్

కరీమాబాద్, మే18(ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా దంపతుల రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఎందరో బలయ్యారని, ఇప్పుడు తన వంతు వచ్చిందని 20 డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ అన్నారు. ఓ మహిళ ఇచ్చిన అత్యాచారం యత్నం ఫిర్యాదుతో ఆదివారం ఉదయం గుండేటి నరేందర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. రాత్రి వరకు కస్టడీలో ఉంచుకొని ఇద్దరు వ్యక్తుల సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నుంచి బయటికి వచ్చిన కార్పొరేటర్ గుండేటి నరేందర్ మీడియాతో మాట్లాడారు. కొండా దంపతుల చర్యలకు ఎందరో బలయ్యారని, ఇప్పుడు నా వంతు వచ్చిందన్నారు. ఈ విషయం అన్ని రాజకీయ నాయకులకు, నియోజకవర్గ ప్రజలకు తెలిసిన విషయమేనని అన్నారు. వారి అరాచకాలను ధైర్యంగా ఎదురించలేని, ఖండించలేని పరిస్థితి ఉందన్నారు. తనపై కేసు విషయంలో చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. తనపై పెట్టిన కేసు విషయమై అన్ని రాజకీయ పార్టీల నాయకులు ముకుమ్మడిగా తీవ్రంగా ఖండించారని అన్నారు. అదే విధంగా తనకు సంఘీభావం తెలిపిన పద్మశాలీ కులసంఘం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

కరీమాబాద్, మే18(ఆంధ్రజ్యోతి): 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ తనపై అత్యాచారయత్నం చేయబోయాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ జూపల్లి వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. రాంకీలో నివాసం ఉంటున్న 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌ను కలిసేందుకు ఆదివారం ఉదయం అదే డివిజన్‌కి చెందిన ఓ మహిళా కాంగ్రెస్ నాయకురాలు వెళ్లారు. ఈ సందరభంగా కార్పొరేటర్ గుండేటి నరేందర్ తనతో అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు, అత్యాచారయత్నానికి ప్రయత్నించారని ఆమె బయటకు వచ్చి 100కు డయల్ చేశారు. అనంతరం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ తనపై అత్యాచారయత్నానికి ప్రయత్నించడంతో పాటు కులం పేరుతో అవమానించాడని పేర్కొన్నారు. ఈ మేరకు కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ఖండించిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని

కార్పొరేటర్ గుండేటి నరేందర్ అరెస్టును మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఖండించారు. రాజకీయ కక్ష సాధింపులో ఇదొక భాగమని, గతంలో కూడా ఇలాంటివి చాలా జరిగాయని అన్నారు. గతంలో పెట్టిన కేసులపై సంబంధిత అధికారులు విచారణ చేయా లని కోరారు.

దూసుకొచ్చిన మృత్యువు



తాడ్వాయిలో జరిగిన ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన మహిళ

- ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ
- ఇద్దరు మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 25 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

తాడ్వాయి, మే 18 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క - సారమ్మల దర్శనానికి వచ్చిన ఒకే గ్రామానికి చెందిన వారిపై ఇసుక లారీ మృత్యుశకటం రూపంలో దూసుకొచ్చింది. వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా పలువురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కుటుంబ సభ్యులతో కలిసి 35మంది ట్రాక్టర్‌లో మేడారం వనదేవతల దర్శనానికి ఆదివారం ఉదయం వచ్చారు. వనదేవతలను దర్శించుకొని భోజనాలు చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తాడ్వాయి మండలకేంద్రంలో 163 జాతీయ రహదారిపై కూల్‌డ్రింక్స్ తాగడానికి ఓ దుకాణం వద్ద ఆగారు. ఈ క్రమంలో ఏటూరునాగారం వైపు నుంచి వస్తున్న ఇసుక లారీ ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ 20మీటర్లు ఎగిరిపడడంతో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. మృతిచెందిన వారిలో ఉప్ప దుర్గ (38), చేతుపల్లి సీత(40) ఉన్నారు. అలాగే చేతుపల్లి సిద్ధు (20), చేతుపల్లి ముత్తమ్మ (45) పరిస్థితి విషమంగా ఉంది. కాగా, ట్రాక్టర్‌లో ప్రయాణిస్తుండగా 25 మందికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను తాడ్వాయి, ములుగు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. కాగా, లారీ డ్రైవర్ విషయం తెలియాల్సి ఉంది.





ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైన భక్తులు

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర మేయర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

రేపటి నుంచి కేయూ పీజీ పరీక్షలు

కేయూ క్యాంపస్ మే 18, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 20 నుంచి పీజీ కోర్సుల పరీక్షలు గతంలో ప్రకటించిన విధంగా షెడ్యూల్ మేరకు మే 20 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు ఆదివారం తెలిపారు. పరీక్షల ఫీజులు చెల్లించిన విద్యార్థుల హాల్‌టికెట్లు వర్సిటీ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు అందజేయనున్నారు. వర్సిటీ పరిధిలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంఎస్‌డబ్ల్యూ, సైకాలజీతో పాటు ఇతర కోర్సుల పరీక్షలన్నీ జరుగుతాయి. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డును కాపాడాలి

ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

వరంగల్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డును కాపాడాలని ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కోరారు. వరంగల్ ఎంజీఎం హస్పిటల్ ఎదురుగా గల ఇస్లామియా కళాశాల మైదానంలో ఆల్‌ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డ్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు జాతీయ అధ్యక్షుడు మౌలానా ఖలీద్ సైఫుల్లా రెహమానీ, ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. అన్ని మతాలు, కులాలు, వర్గాలతో ముస్లింలు భాయ్ - భాయ్‌గా, కుటుంబసభ్యులుగా ఉంటారని తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ యుద్ధంలో పాల్గొన్న పైలట్ కల్నల్ సోఫియా ఖురేషిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ ఎంపీపై బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముస్లింలు రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తూ భారత భూమిని మొక్కుతారని అన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణ జరిగితే భారతదేశంలో ఉన్న హిందుస్థాన్ ముస్లింలందరం కలిసి దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. తిరుపతి, ఇతర దేవాలయాల్లో ముస్లింలు ఉన్నారా?, ముస్లిం వక్ఫ్ బోర్డు విషయంలో మీరు ఎందుకు జోక్యం చేసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడితే ఊరుకునేది లేదని ఆయన తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం కోసం ఎంతోమంది ముస్లింలు పోరాడారన్నారు. తాము హిందుస్థాన్ ముస్లింలమని ఆయన స్పష్టం చేశారు. వెంటనే వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఆయన కోరారు. అనంతరం కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన ప్రజల ఆత్మకు శాంతి చేకూరాలని ముస్లిం మత పెద్దలు, ఇతర ప్రజాసంఘాల నాయకులతో కలిసి మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఇతర ప్రజా సంఘాల నాయకులు, వేల సంఖ్యలో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన ముస్లింలు


ఎడ్లబండిపై నది వద్దకు భక్తులు


భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు

పుష్కర స్నానానికి పుష్కల జనం..



ఆదివారం సెలవు రోజు భక్త జన సందోహం


పుష్కరఘాట్ వద్ద పుణ్యస్నానానికి వస్తున్న భక్తులు

- కిటకిటలాడిన పుష్కరఘాట్, ఆలయ పరిసరాలు
- వరుసగా రెండో రోజూ కొనసాగిన వాహనాల రద్దీ
- 15 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- వన్‌వే ఏర్పాటు చేసి క్రమబద్ధీకరించిన అధికారులు
- ముక్తీశ్వరుడిని దర్శించుకున్న తీన్మార్ మల్లన్న, నటుడు రాజేంద్రప్రసాద్

కాళేశ్వరం, మే 18(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం త్రివేణి సంగమం తీరాన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సరస్వతీ నదీమాత పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ సందడిగా మారాయి. ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా రోడ్లవెంట బారులు తీరాయి. శనివారం గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడగా, తాజాగా వన్‌వే ఏర్పాటు చేశారు. నాలుగోరోజు పలువురు ప్రముఖులు పుష్కరస్నానమాచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

పోటెత్తిన భక్తజనం

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా నాలుగో రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. సరస్వతీ పుష్కరఘాట్‌తో పాటు సాధారణ మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో సంగమ తీరం జనసంద్రంగా మారింది. దీంతో పుష్కర ఘాట్లతో పాటు ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసి పోయాయి.



ముక్తీశ్వరా.. నిన్ను దర్శించేదెలా..!

సరస్వతీ పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా, అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో కాళేశ్వరా.. నిను దర్శించేదెలా..? అంటూ భక్తులు ఆందోళన చెందుతున్నారు. పుష్కరాల్లో కేవలం పుష్కర స్నానాలకే ప్రాధాన్యమిచ్చారని.. స్వామి వారి దర్శనాలకు ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఇక మంచిర్యాల, చెన్నూరుతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు పుష్కరస్నానానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో వచ్చే ఆర్టీసీ బస్సులు పాత బస్టాండు వరకే వస్తుండడంతో అక్కడి నుంచి పుష్కరఘాట్‌కు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి నుంచి పుష్కరఘాట్‌కు వెళ్లేందుకు ఎలాంటి ఉచిత సర్వీసు లేకపోగా ఆటోలు పరిమిత సంఖ్యలోనే నడుస్తుండడంతో భక్తులు కాలినడకనే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎర్రటి ఎండలో సుమారు రెండు కిలోమీటర్ల మేర నడిస్తే తప్ప పుష్కరఘాట్‌కు చేరుకోలేని పరిస్థితి ఎదురవుతోందని వాపోతున్నారు. ఈ మార్గంలోనూ ఉచిత సర్వీసు ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రద్దీగా రహదారులు.. బారులు తీరిన వాహనాలు

ఆదివారం సెలవు దినం కావడంతో రహదారులన్నీ రద్దీగా మారాయి. ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో వాహనాలన్నీ కిక్కిరిసిపోయాయి. సుమారు 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దీంతో కొన్ని గంటల పాటు వాహనాలు నెమ్మదిగా వెళ్లసాగాయి. అధికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండటంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే సుమారు 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జామ్‌కు ఓ కారణమవుతున్నాయి. అడవిలో అక్కడక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాల నియంత్రించాల్సిన అధికారులు ఆదిశగా పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లా స్థాయి అధికారులు వస్తే తప్ప.. విధుల్లో పాల్గొనడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా శనివారం వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. దీంతో ఎట్టకేలకు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా కాటారం వైపు వెళుతున్నాయి. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

సాఫీగా సాగిన దర్శనాలు.. సందడిగా పరిసరాలు..

పుష్కరాలకు వస్తున్న భక్తులతో కాళేశ్వరం పరిసరాలు సందడిగా మారాయి. ప్రధానంగా సరస్వతీ ఘాట్‌లో భక్తులు భారీగా పుణ్యస్నానాలు అచరించారు. మూడు రోజులుగా దర్శనాలకు సాదారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోప ురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.



ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామితో పాటు సినీ నటుడు రాజేంద్రప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నలు పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

అందుబాటులోకి ఏరియల్ రైడ్

సరస్వతీ పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం నుచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుంచి ఈ రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు రూ.4500చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ ఈ రైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.


నదిలో పూజలు చేస్తున్న హైకోర్టు జడ్జి శ్రీ సుధ


పుష్కరపూజలో పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి


కాళేశ్వరం గోదావరి నదిలో పుష్కర స్నానాల కోసం వేలాదిగా వస్తున్న భక్తులు


పుష్కరస్నానం చేస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కుటుంబం


పుష్కర స్నానం చేసి వస్తున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్


ముక్తీశ్వరస్వామి దర్శనానికి క్యూలైన్‌లో వేచివున్న భక్తులు


నదిలో పుష్కరస్నానాలు చేస్తున్న భక్తులు

ట్రా'ఫికర్' పరిష్కారానికి పోలీసుల ప్రణాళికలు

- కాళేశ్వరానికి కొద్ది దూరం నుంచి వన్ వేగా మార్చేలా చర్యలు
- అటవీ ప్రాంతంలో పోలీస్ సిబ్బందిని పెంచడానికి ప్రతిపాదనలు

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తుల విషయంలో అధికార యంత్రాంగం అంచనాలు తలకిందులవడంతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. పుష్కరాల ప్రారంభం నాటి నుంచి రెండురోజుల పాటు భక్తుల రాక అంచనాల మేరకే ఉండగా శని, ఆదివారాల్లో లక్షకు పైగా భక్తులు వేలాది వాహనాల్లో తరలిరావడంతో కిలోమీటర్ల మేర భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. మహదేవపూర్ నుంచి కాళేశ్వరానికి 17కిలోమీటర్లు ఉండగా వాహనాలకు 2-3గంటల సమయం పట్టడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడి ఏర్పాట్లపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే స్వయంగా అడవిలోని రహదారిపై ట్రాఫిక్ క్లియర్ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పట్టిందని చెప్పవచ్చు. దీంతో పోలీస్ అధికారులు ట్రాఫికర్ పరిష్కారం కోసం ఆదివారం రాత్రి పటిష్ట ప్రణాళికలు చేస్తున్నారు. పోలీస్ అధికారులు రెండు మూడు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించినట్లు సమాచారం. చివరికి కాళేశ్వరానికి కొద్ది దూరం నుంచి వన్‌వేగా మార్చి ట్రాఫిక్ ఇబ్బందులు కొంతమేరనైనా తప్పించేలా చర్యలు చేపడుతున్నారు.


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

మహదేవపూర్ నుంచి వచ్చే వాహనాలను అన్నారం క్రాస్ నుంచి అన్నారం, చంద్రుపల్లి, మద్దులపల్లి, పూసుకుపల్లి, ఇప్పలబోరు మీదుగా పుష్కరఘాట్ పార్కింగ్ ఏరియాలకు వాహనాలను మళ్లించేలా వన్‌వేగా చేయనున్నట్లు తెలుస్తోంది. కాళేశ్వరం నుంచి వెళ్లే వాహనాలు యథావిధిగా అన్నారం క్రాస్ మీదుగా మహ దేవపూర్ వెళ్లేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. అలాగే అటవీప్రాంతంలోని పలుచోట్ల పోలీస్ సిబ్బందిని పెంచి వాహనాల రాకపోకలను నియంత్రించేలా ప్రణాళికలు రూపొందించారు.

ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్


ట్రాఫిక్‌లో చిక్కిన అంబులెన్స్

కాళేశ్వరం, మే 18: కాళేశ్వరం క్షేత్రంలో సరస్వతీ పుష్కరాలకు వస్తున్న వేలాది వాహనాలతో ఆదివారం ట్రాఫిక్ జామ్ అయింది. ఇందులో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ సీహెచ్‌సీ 108అంబులెన్స్ సైతం చిక్కుకుంది. గ్రావిటీ కెనాల్ సమీపంలో ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసులు వాహనాలను వన్‌వేగా పంపిస్తుండడంతో కార్లు వేగంగా వెళ్తుండగా అంబులెన్స్‌కు దారి లేకుండా పోయింది. దీంతో కొన్ని నిమిషాల అనంతరం ఇతర వాహనదారులు, ఆంధ్రజ్యోతి బృందం అక్కడికి చేరుకున్న వెంటనే ట్రాఫిక్‌ను క్లియర్ చేయించడంతో అంబులెన్స్ వెళ్లిపోయింది.

నేడు కాళేశ్వరానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ రాక

కాళేశ్వరం, మే18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో అత్యంత వైభవంగా జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సోమావరం రాన్నుట్లు అధికారులు ఆయన పర్యటన వివరాలను ప్రకటించారు. సోమవారం ఆయన కరీంనగర్ నుంచి రోడ్డుమార్గంలో ఉదయం 8:30గంటలకు బయలుదేరి 10:30 గంటలకు కాళేశ్వరం చేరుకొని సరస్వతీ నదిలో పుష్కర స్నానమాచరించి ఆలయంలో పూజలు నిర్వహించన్నుట్లు అధికారులు తెలిపారు.

పుష్కర్‌ఘాట్ వద్ద గుర్తు తెలియని మృతదేహం

కాళేశ్వరం, మే 18:కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమం తీరం ఒడ్డున ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని పురుషుడి మృతదేహం లభ్యమైనట్లు కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి తెలిపారు. పుష్కరాల్లో నాలుగు రోజులుగా యాచక వృత్తి చేస్తున్న 40 ఏళ్ల వ్యక్తి ఆదివారం ప్రధాన పుష్కర ఘాట్ ఒడ్డున గల చెట్టు కింద మృతి చెంది కనిపించాడన్నారు. సదరు వ్యక్తి ఎండదెబ్బకు చనిపోయాడో.. గుండెపోటుతో మృతి చెందాడో.. వైద్య పరీక్షల్లో తెలుస్తుందన్నారు. మృతదేహాన్ని మహదేవపూర్ సామాజిక ఆస్పత్రిలో ప్రిజర్వ్ చేస్తున్నామని మృతదేహం ఆచూకీ తెలిసిన వారు 8712658115నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరుతున్నారు.


సరస్వతి నవరత్నమాల హారతి

వైభవంగా పుష్కర నవరత్న హారతి

కాళేశ్వరం, మే 18(ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీ పుష్కరాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి 7.30గంటలకు ఏడుగురు కాశీపండితులు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు, కాళేశ్వర-ముక్తీశ్వర ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

- పుష్కరాలకు పెరుగుతున్న భక్తుల రద్దీ
- వందల సంఖ్యలో వస్తున్న వాహనాలు
- క్రమబద్ధీకరించేందుకు ఎదురవుతున్న సమస్యలు
- మౌలిక సదుపాయాలు సరిపోయేనా? అని అనుమానాలు


మహదేవ్‌పూర్ - కాళేశ్వరం దారిలో ట్రాఫిక్ జామ్

కాళేశ్వరం, మే 18(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు ట్రా'ఫికర్' అవుతున్నారు. ట్రాఫిక్‌ను ఛేదించి పుష్కరాలకు వచ్చిన వారికి మౌలిక వసతులు అందుతాయా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతున్న అధికారులు.. మాత్రం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యను గుర్తించి పరిష్కరించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

గుణపాఠం నేర్చుకోకపోతే ఎలా..?

రెండు రోజులుగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడి భక్తులు ఇబ్బందులు పడుతుంటే పరిష్కార దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత అనుభవాల ద్వారా సమస్యలకు పరిష్కారం కనిపెట్టకపోతే గుణపాఠం తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పుడే ఈ పరిస్థితి ఎదురైతే ముందుముందు భక్తుల సంఖ్య పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శని, ఆదివారాల్లో పుష్కరాలకు వచ్చిన భక్తుల సంఖ్య సుమారు లక్షన్నర దాటకకముందే ట్రాఫిక్ సమస్యల ఇలా ఉంటే.. రెండు నుంచి మూడు లక్షల పైచిలుకు భక్తులు వస్తే పరిస్థితిని అదుపు చేయగలమా? అనే దానిపై సమీక్షించాల్సి ఉంది.

వసతులు సరిపోతాయా..?

సరస్వతీ, ప్రధాన పుష్కరఘాట్లతో పాటు ఆలయ పరిసరాల్లోనూ ఇప్పుడున్న వసతులు సరిపోతాయా? అనేదానిపై మరోసారి సమీక్షించాల్సిన అవసరం ఉంది. పుష్కరాలు ప్రారంభమైన మూడు రోజుల్లోనే భక్తుల సంఖ్య ఇలా ఉంటే ముందుందు, పుష్కరాల చివరి రోజుల్లో భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఇప్పుడున్న మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్లు సరిపోతాయా? లేదా అనేదానిపై సమీక్షించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్ల వద్ద కూడా సరైన ఎర్పాట్లు లేవు. ఉన్న మరుగుదొడ్లు భక్తులకు అవసరమున్న చోట కాకుండా ఇతర ప్రాంతాల్లో ఉండడంతోనూ అవి నిరుపయోగంగా ఉన్నాయనే విమర్శలు వస్తున్నాయి.

ముందుచూపు లేకపోతే ఇబ్బందులే..

రెండు రోజులుగా ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు, మరుగుదొడ్లు, తాగునీరు ఇబ్బందులను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పేలా లేవు. కింది స్థాయి సిబ్బంది క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాల్సి ఉండగా, వారేమీ పట్టనట్లుగా వ్యహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అధికార యంత్రాంగం దీనిపై ముందుచూపుతో వ్యవహరిస్తే తప్ప పుష్కరాలు గట్టెక్కే పరిస్థితి లేదు. అధికార యంత్రాంగం ఇప్పటికైనా ముందుచూపుతో వ్యవహరిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

డంప్‌యార్డు పరిష్కారం కోసం పాదయాత్ర

మడికొండ, మే 18 (ఆంధ్రజ్యోతి): మడికొండ, రాంపూర్ పరిసర గ్రామాల ప్రజలకు ప్రాణాంతకంగా మారిన డంపింగ్‌యార్డ్ సమస్య పరిష్కారం కావాలని కోరుతూ మడికొండకు చెందిన హనుమాన్ మాలధారులు ఆదివారం కొండగట్టుకు పాదయాత్రతో బయల్దేరారు. మాజీ కార్పొరేటర్ తొట్లరాజు యాదవ్, డంప్ యార్డ్ నిర్మూలన కమిటీ సభ్యులు తౌటిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పొనగోటి వెంకట్రావ్, దువ్వ శ్రీకాంత్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రలో దువ్వ నవీన్, కుక్కల రాజేందర్, కుక్కల రాకేష్, ఆకుల చింటు, సింగారపు చందు, బైరా నాగేష్, బైరి అజయ్, అఖిల్ సాయి, బద్రి తదితరులు ఉన్నారు.


మడికొండ నుంచి కొండగట్టుకు బయల్దేరిన హనుమాన్ భక్తులు

ఎంఎస్సీ బయో కెమిస్ట్రీతో ఉద్యోగాలు

కుడ్లె మధుకర్‌రావు, కేయూ బయో కెమిస్ట్రీ విభాగాధిపతి

ముఖాముఖి



ఆంధ్రజ్యోతి: జీవ రసాయన శాస్త్ర అధ్యయన ప్రాధాన్యం ఏమిటి ?

విభాగాధిపతి: మానవ జీవన విధానంలో జరిగే ప్రక్రియలను అధ్యయనం చేస్తుంది.

ఆంధ్రజ్యోతి: మానవ జీవన విధానంలోని అంశాలు ఏమిటి ?

విభాగాధిపతి: కొన్ని అమైనో ఆసిడ్స్ గ్రూప్‌లను ప్రోటీన్లు అంటారు. మానవ జీవన విధానం ప్రోటీన్ ఉత్పత్తి, ప్రోటీన్ల అనువర్తనంతో జీవన క్రియలో విధానాలను అధ్యయనం చేస్తోంది.

ఆంధ్రజ్యోతి: బయో కెమిస్ట్రీ పీజీ చదివేందుకు అర్హతలు ఏమిటి ?

విభాగాధిపతి: డిగ్రీలో బీఎస్సీ బైపీసీ కోర్సు ఉత్తీర్ణులైనవారు అర్హులు.

ఆంధ్రజ్యోతి: అడ్మిషన్లకు పోటీ ఎలా ఉంటుంది ?

విభాగాధిపతి: రాష్ట్రవ్యాప్తంగా లైఫ్ సైన్స్ కోర్సుల్లో బయో కెమిస్ట్రీకి మొదటి ప్రాధాన్యం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి: కోర్సులో ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి ?

విభాగాధిపతి: ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలైన శాంతా బయోటెక్, భారత్ బయోటెక్, జీవీకే, రెడ్డీస్, బయోలాజికల్ ఈ ఫార్మా కంపెనీల్లో, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, ఎంఎన్‌సీ ల్యాబ్‌లు, మల్టీ నేషనల్ ఆస్పత్రులు, జాతీయ, అంతర్జాతీయ పరిశోధన సంస్థల్లోనే ఉద్యోగాలు వస్తాయి. మెడికల్ కాలేజీలు, అగ్రికల్చర్ కాలేజీలు, ఫార్మసీ కళాశాలలు, ఎంఎల్‌టీ కాలేజీల్లో ఉద్యోగాలు లభిస్తాయి.

ఆంధ్రజ్యోతి: మెడికల్ కోడింగ్‌లో ఎలాంటి ఉద్యోగ అవకాశాలున్నాయి ?

విభాగాధిపతి: మెడికల్ కోడింగ్‌లో మెడికల్ ప్రిస్క్రిప్షన్ బట్టి మందులను ఇస్తారు.

ఆంధ్రజ్యోతి: అంతర్జాతీయ స్థాయిలో కోర్సు ప్రాధ్యానం ఏమిటి ?

విభాగాధిపతి: పోస్టు డాక్టరల్ ఫెల్లోషిప్‌లో చేయవచ్చు, అలాగే కెనడా, జపాన్, జర్మనీ, ఇటలీ, ఇండోనేషియా, ఇజ్రాయెల్, అమెరికా, ఆస్ట్రేలియా బ్రిటన్ దేశాల్లో ఐటీతో సమానంగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారు.


ఆంధ్రజ్యోతి: రిసెర్చ్ సెంటర్లలో ఎలాంటి అవకాశాలుంటాయి ?

విభాగాధిపతి: రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అనాలసిస్ రంగాల్లోనూ ప్రాధాన్యం ఉంటుంది.

\- కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి)

కాసుల కోసం 'కోతలు'

- జిల్లాలో విచ్చలవిడిగా సిజేరియన్ కేసులు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో తగ్గుతున్న సాధారణ ప్రసవాలు
- సుమారు 80 శాతానికి పైగా ఆపరేషన్లే..
- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ అంతే..
- శస్త్ర చికిత్సలతో బలహీన పడుతున్న మహిళలు





పోచమ్మమైదాన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇష్టారాజ్యంగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. కాసుల కోసం విచ్చలవిడిగా సి సెక్షన్ ఆపరేషన్లు చేస్తున్నారు. దీంతో యేటా నార్మల్ డెలవరీల సంఖ్య తగ్గుతోంది. మొత్తం ప్రసవాల్లో సుమారు 80 శాతానికి పైగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వరంగల్ జిల్లా పరిధిలో సీకేఎం ఆస్పత్రితో పాటు రెండు ఏరియా ఆస్పత్రులు, ఏడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 14 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు సీహెచ్‌సీ సెంటర్లు (సామాజిక ఆరోగ్య కేంద్రాలు) ఉన్నప్పటికీ సిబ్బంది కొరత, వసతుల లేమితో ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాలకు మొగ్గు చూపడం లేదు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులలో కత్తెర కాన్పుల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేయాల్సి ఉండగా... ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్న గర్భిణీలు సైతం ఏ ఆస్పత్రికి వెళ్లినా దాదాపు ఆపరేషన్లతోనే తిరగి వస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆస్పత్రులలో సైతం నార్మల్ డెలవరీలు తగ్గిపోయి, సిజేరియన్లు పెరుగుతుండటం గమనార్హం.

● విచ్చలవిడిగా సిజేరియన్ వ్యాపారం..

జిల్లాలో రోజురోజుకూ సిజేరియన్ వ్యాపారం పెరుగుతోంది. ప్రసవాల పేరుతో డబ్బుల కోసం సిజేరియన్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని అనేక చోట్ల ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కమిషన్ల కోసం గర్భిణులను ప్రైవేటు ఆస్పత్రుల బాట పట్టిస్తున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు అనేక కారణాలు చెబుతూ సిజేరియన్ డెలవరీలకు మొగ్గు చూపుతున్నారు. ఆపరేషన్ కాన్పుల వల్ల తల్లి...బిడ్డలకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలిసినప్పటికీ కొంతమంది వైద్యులు మానవత్వం మరచి కత్తెర కాన్పులకు తెగబడుతున్నారు. జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులలో ఒక్కో సిజేరియన్ ఆపరేషన్‌కు సుమారు రూ. 40 నుంచి రూ. లక్ష వరకు దండుకుంటున్నారు. పట్టించుకునేవారు లేకపోవడంతో ఇష్టారీతిన సిజేరియన్ వ్యాపారం జోరుగా సాగుతుంది.

● క్షీణిస్తున్న మహిళల ఆరోగ్యం..

సిజేరియన్ ప్రసవాలతో మహిళలు బలహీన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. మొత్తం ప్రసవాలలో గర్భిణీలకు ఆరోగ్య సమస్యల వల్ల 20 శాతం లోపే సిజేరియన్ ప్రసవాలు అవసరమవుతాయని, అంతకు మించి జరిగితే తల్లిబిడ్డ ఇద్దరికీ ప్రమాదమని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. సిజేరియన్ల వల్ల తల్లులకు ఇన్‌ఫెక్షన్‌లు వచ్చే ప్రమాదం ఉందని, అనస్థీషియా రియాక్షన్ జరిగే ప్రమాదం ఉందని, తద్వారా భవిష్యత్తులో అనేక ఇబ్బందులు తలెత్తుతాయని పలువురు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువగా రక్తస్రావం జరిగితే కోలుకోవడానికి చాలా సమయం పడుతుందని, రెండో ప్రెగ్నెన్సీ సమయంలో అనేక సమస్యలు ఎదురౌతాయని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి స్పందించి జిల్లాలో సిజేరియన్లను అరికట్టాలని, నార్మల్ డెలవరీలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జిల్లాలో ఎక్కువ శాతం సిజేరియన్‌లే..

జిల్లాలో నూటికి 80 శాతానికి పైగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి...

2022-23లో జరిగిన ప్రసవాల సంఖ్య - 12,015

- ప్రభుత్వ ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 6,937 (నార్మల్ డెలవరీలు - 3030, సిజేరియన్లు 3,907).
- ప్రైవేటు ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 5,078 (నార్మల్ డెలవరీలు - 722, సిజేరియన్లు 4,356).

2023-24లో జరిగిన ప్రసవాల సంఖ్య - 11,697

- ప్రభుత్వ ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 6,440 (నార్మల్ డెలవరీలు - 2,734, సిజేరియన్లు 3,706).
- ప్రైవేటు ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 5,257 (నార్మల్ డెలవరీలు - 747, సిజేరియన్లు 4,510).

2024-25లో (ఇప్పటి వరకు) - 10,275

- ప్రభుత్వ ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 5,500 (నార్మల్ డెలవరీలు - 2,107, సిజేరియన్లు 3,393).
- ప్రైవేటు ఆస్పత్రులలో జరిగిన ప్రసవాలు - 4,775 (నార్మల్ డెలవరీలు - 711 సిజేరియన్లు 4,064)

కార్పొరేటర్‌పై కేసు పెట్టడం సరికాదు

● ఖండించిన పద్మశాలి సంఘం నాయకులు

కరీమాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై అక్రమంగా కేసులు పెట్టడం సరికాదంటూ పద్మశాలి సంఘం నాయకులు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సాయంత్రం నిరసనకు దిగారు. కావాలనే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని, లేదంటే బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో సంఘం నాయకులు మూర్తి, కుసుమ సతీష్, గోరంట్ల రాజు, బైరి శ్యాం సుందర్, కూచన క్రాంతి, గుండు కామేశ్వర్, ఆడెపు వెంకటేష్, సామంతుల నిరంజన్ వెంకన్న, కొంతం సంగీత్, కోమాకుల నాగరాజు, సత్యం, శ్రీధర్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కక్ష సాధింపు తగదు: ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ: కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై రాజకీయ కక్ష సాధింపు తగదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. ఆదివారం ఓసిటీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సొంత పార్టీ నేతలే నరేందర్‌పై కక్షకట్టి అరెస్టు చేయించారని ఆరోపించారు. నరేందర్ అరెస్టును ఖండిస్తున్నామని, ఆయనను బేషరతుగా విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు. నరేందర్‌పై వచ్చిన ఫిర్యాదును పోలీసులు విచారణ చేసి నిజానిజాలు బయటకు తీయాలని డిమాండ్ చేశారు.


పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న పద్మశాలి కుల సంఘం నాయకులు

● అరెస్టును ఖండించిన వర్తక సంఘం

వరంగల్ సిటీ: కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని కాశిబుగ్గ వర్తక పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి వడిచర్ల సదానందం ప్రకటించారు. ఒక మహిళ చేసిన ఆరోపణలపై అరెస్టు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. పోలీసులు విచారణ జరిపి నిజానిజాలు తెలుసుకుని ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో పూజారిపై దాడి



పోచమ్మమైదాన్, మే 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్ దేశాయిపేటలో ఓ యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ సృష్టించాడు. ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సోమేశ్వరశర్మ అనే పూజారిపై దాడికి పాల్పడ్డాడు. నానా దుర్భాషలాడుతూ సెల్‌ఫోన్ లాక్కొని పగులగొట్టి హంగామా సృష్టించాడు. దీంతో స్థానికులు సదరు యువకుడిని అడ్డుకున్నట్లు తెలిసింది. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఇంతెజార్ గంజ్ పోలీసులు తెలిపారు.

కోల్డ్ స్టోరేజీలో తనిఖీలు

వరంగల్ వ్యవసాయం, మే 18(ఆంధ్రజ్యోతి): వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని న్యూ కాకతీయ కోల్డ్ స్టోరేజీలో ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది ఆదివారం తనిఖీ చేశారు. ఈ స్టోరేజీలో రైతులకు సంబంధించిన మిర్చి లేకున్నా ఉన్నట్లు చూపించి నిర్వాహకులు కోట్ల రూపాయల రుణం తీసుకున్నారంటూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీంతో వారికి రుణం ఇచ్చిన ఫైనాన్స్ కంపెనీ వారు ఆదివారం కోల్డ్ స్టోరేజీని సందర్శించి తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఆదివారం ఒక బ్లాక్ తనిఖీ చేయగా మిగితా స్టాక్‌ను సోమ,మంగళవారాల్లో నిర్వహిస్తారని తెలిసింది. ఇదిలా ఉంటే కొందరు కావాలనే న్యూ కాకతీయ కోల్డ్ స్టోరేజీపై దుష్ప్రచారం చేస్తున్నారని సదరు యాజమాన్యం ఆవేదన వ్యక్తం చేసింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు

వరంగల్ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంజీఎం సెంటర్‌లో గల శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయం వార్షికోత్సవం పూజలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి 54 లీటర్ల ఆవు పాలు, 500 మామిడి పండ్లు, 3600 కొబ్బరి కాయలతో పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. అనంతరం భక్తులకు కొబ్బరి కాయలు, మామిడి పండ్లను ప్రసాదంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వొద్దిరాజు వెంకటేశ్వర్ రావు, అర్చకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తల జోలికొస్తే ఖబర్దార్

కాంగ్రెస్ నాయకులకు దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరిక


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

వరంగల్ చౌరస్తా, మే 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాలు, కార్యకర్తల జోలికొస్తే ఖబర్దార్ అని మాజీ చీఫ్ విప్, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. ఆదివారం 29వ డివిజన్ రామన్నపేటలో బీఆర్‌ఎస్ డివిజన్ యూత్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. డివిజన్ అధ్యక్షుడు కె. సదాంత్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీ కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించినా.. బెదిరింపులకు పాల్పడినా ఊరుకోబోమన్నారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో 29వ డివిజన్‌లో రూ.27 కోట్లతో 344 అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వొద్దిరాజు గణేష్, నాయకులు షఫీ, రమేష్, చందు, రాజు, నాగమణి, తహసీల్, లక్ష్మి, రహీం, శ్రీను, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభించిన వాక్ ఫౌండేషన్


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటరమణ, ప్రదీప్‌రావు, అరూరి రమేశ్, రవికుమార్

మట్టెవాడ మే 18, (ఆంధ్రజ్యోతి): వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మమైదాన్ సెంటర్‌లో ఆదివారం జలదానం శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ.. 18 ఏళ్ళుగా వాక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, వన్నాల శ్రీరాములు, గజ్జెల్లి శ్రీరాములు, రత్నం సతీశ్‌షా, అడెపు వెంకటేశ్, మార్టిన్ లూథర్, బైరి శ్యాం తదితరులు పాల్గొన్నారు.

పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు వద్నాల మల్లయ్య

వరంగల్ చౌరస్తా, మే 18 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని పద్మశాలి పరస్పర సహాయక సహకార పరపతి సంఘం 48వ వార్షికోత్సవం ఆదివారం సంఘ కల్యాణ మండపంలో నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మాచర్ల వెంకటేశ్వర్లు నివేదికను సమర్పించారు. సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వద్నాల మల్లయ్య, ఉపాధ్యక్షులుగా శామంతుల బిక్షపతి, పాశికంటి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా మాచర్ల వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శిగా చిదురాల రాజలింగం, పాశికంటి రవికుమార్, కోశాధికారులుగా దాసి సురేందర్, పిట్ట భాస్కర్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా దాసరి ప్రేమ్‌సాగర్, పాశికంటి రాజేంద్రప్రసాద్ వ్యవహరించగా సభ్యుల జీవిత భద్రతను రూ. 40 నుంచి 50 వేలకు పెంచారు. కొత్తగా 81 మంది సభ్యులను తీసుకోవాలని నిర్ణయించారు.

బీజేపీ కృషి వల్లే వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధి

పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్


రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు

గిర్మాజిపేట, మే18(ఆంధ్రజ్యోతి): వరంగల్ రైల్వేస్టేషన్‌ను రూ.25 కోట్లతో ఎయిర్‌పోర్టు తరహాలో అభివృద్ధి చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ స్పష్టం చేశారు. ఈనెల 22న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వరంగల్ రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆదివారం బీజేపీ నాయకులు వరంగల్ రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. రవికుమార్‌తో పాటు మాజీ ఎంపీ డాక్టర్ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తదితరులు స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్కలేటర్లు, ర్యాంపులు, లిఫ్టులు, పుట్‌ఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడారు. కొమురవెల్లిలో నూతనంగా రైల్వేస్టేషన్‌ను ఏర్పాటుచేస్తున్న ఘనత బీజేపీ ప్రభుత్వానిదేనని అన్నారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు ఈనెలలో దేశంలో పరుగులు పెడుతాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్టు మాదిరిగా అభివృద్ధి చేయడంతో పాటు వరంగల్‌కు అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుమతులు ఇచ్చారని, త్వరలోనే విమానాశ్రయం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు.

ఈ సమావేశంలో బీజేపీ నాయకులు ఎరుకల రఘునా రెడ్డి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్, రంజిత్ కుమార్, క్రాంతి కుమార్, మురళీకృష్ణ, దీనదయాళ్, గడల కుమార్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం

● బహిరంగసభలో ప్రజా సంఘాల నేతలు

వరంగల్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో పనిచేస్తోందని పలు ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. వరంగల్‌లోని ఎంజీఎం హాస్పిటల్ ఎదురుగా గల ఇస్లామియా కళాశాల మైదానంలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ముస్లిం మత పెద్దలు, నాయకులతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలోని చట్టాలను మార్చి వక్ఫ్ బోర్డు చట్టాన్ని మార్చాలని చూస్తోందని, దాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, ఉద్యమకారులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● రెండు పార్టీల నాయకుల వాగ్వివాదం..

వరంగల్‌లోని ఇస్లామియా కాలేజీ గ్రౌండ్‌లో ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభలో ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అధికార పార్టీకి చెందిన 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ ఫుర్ఖాన్, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన డిప్యూటి మేయర్ భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు మసూద్‌లకు మధ్య వాగ్వివాదం జరిగింది. భారీ బహిరంగ సభలో పార్టీలకు అతీతంగా ముస్లిం మత పెద్దలు వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరగా.. రెండు పార్టీలకు చెందిన నాయకులు వారి అనుచరులతో స్టేజీ పైనే గొడవపడ్డారు. స్టేజీ పైన ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పాటు ముస్లిం మత పెద్దలు, వివిధ ప్రజా సంఘాల నేతలు ఉన్నారు. స్టేజీ ఎదుట వేల మంది ముస్లిం ప్రజలు ఉన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా ఇద్దరు నేతలు ఒకవైపు మత పెద్దలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథుల ప్రసంగాలు సాగుతుండగానే స్టేజీ పైన తమ పార్టీ నాయకులకు విలువ ఇవ్వట్లేదని నోరుపారేసుకున్నారు. అనంతరం పోలీసులు, బౌన్సర్లు, మత పెద్దలు కల్పించుకొని వారిరువురికి, కార్యకర్తలకు సర్దిచెప్పి శాంతింపచేశారు. కాగా ఒకవైపు పార్టీలకతీతంగా అని మాట్లాడుతూ మరోవైపు రెండు పార్టీల నాయకులు విలువల గురించి గొడవలు పడడం చర్చాంశనీయమైంది.

ట్యాంకర్ ఢీకొని వృద్ధుడి మృతి

మామునూరు, మే 18(ఆంధ్రజ్యోతి): మామునూరు మండలం అల్లిపురంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లిపురంలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేసే క్రమంలో డ్రైవర్ వాహనాన్ని రివర్స్ తీస్తుండగా ఢీకొని అదే గ్రామానికి చెందిన కొత్తపెల్లి యాకయ్య (75) మృతిచెందాడు. కాగా, ఈ ఘటనకు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుస్తెల తాడు అపహరణ

మట్టెవాడ మే 18, (ఆంధ్రజ్యోతి): కాకతీయ టాకీస్ వెనుక ఇంట్లో ఉంటున్న మహిళ మెడలోంచి గుర్తుతెలియని వ్యక్తి పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. మట్టెవాడ సీఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున రేకుపల్లి నర్సమ్మ ఇంటికి వచ్చిన దుండగుడు.. నీ కుమారుడు రాజు కాకతీయ టాకీస్ వద్ద పడిపోయాడని చెప్పడంతో బయటకు వచ్చింది. వెంటనే అమె మెడలోంచి పుస్తెలతాడును లాక్కొని వెళ్లాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

వరంగల్ క్రైమ్, మే18(ఆంధ్రజ్యోతి): న్యూశాయంపేటలో ఆదివారం జరుగుతున్న బాలిక వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగం పోలీసులు, చైల్డ్‌లైన్ అధికారులు వేడుక వద్దకు వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తల్లిదండ్రులను సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచి కౌన్సెలింగ్ నిర్వహించారు.

వక్కల కుమార్‌కు దళిత రత్న అవార్డు

వడ్డెపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక వేత్త వక్కల కుమార్ దళితరత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఓరుగల్లు చెరువుల పరిరక్షణ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ జిల్లా సెక్రటరీగా వక్కల కుమార్ వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వంచారు. కుమార్ చేసిన సామాజిక, ప్రజాహిత కార్యాక్రమాలను గుర్తించిన రాష్ట్ర అంబేద్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజుమాదిగ కుమార్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. సోమవారం ఆయన హైదరాబాద్‌లో మంత్రి దామోదర రాజ నరసింహా చేతుల మీదుగా దళితరత్న అవార్డును అందుకుంటారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 గ్రేటర్ వరంగల్
సోమవారం 19 మే 2025

పుష్కర స్నానానికి పోటెత్తిన జనం

ఆదివారం సెలవు రోజు భక్తజన సందోహం

- కిటకిటలాడిన పుష్కరఘాట్, ఆలయ పరిసరాలు
- వరుసగా రెండో రోజూ కొనసాగిన వాహనాల రద్దీ
- 15 కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు
- వన్‌వే ఏర్పాటు చేసి క్రమబద్ధీకరించిన అధికారులు
- ముక్తీశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, నటుడు రాజేంద్రప్రసాద్

5



పుష్కరిణికి నారికేళంతో నమస్కరిస్తున్న యువతి

నదిలో పుష్కర స్నానాలు చేస్తున్న భక్తులు

నదీమాతకు దీపంతో యువతి పూజలు



నదీమాతకు దూపం వేస్తున్న కాశీ వేద పండితులు



మహదేవ్‌పూర్ - కాళేశ్వరం దారిలో బారులు తీరిన వాహనాలు



తాడ్వాయిలో జరిగిన ప్రమాదంలో మృతిచెందిన దుర్గ

దూసుకొచ్చిన మృత్యువు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఇసుక లారీ

- ఇద్దరి మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం
- 25 మందికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- తాడ్వాయి జాతీయ రహదారిపై ప్రమాదం
- వనదేవతల దర్శనానికి వచ్చి వెళుతుండగా ఘటన
- బాధితులది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సీతారాంపురం గ్రామం



సీత మృతదేహం

4

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డును కాపాడాలి

- అన్ని మతాలు, కులాలతో అన్నదమ్ముల్లాగా ఉంటాం..
- ఎంఐఎం పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

4



బహిరంగ సభలో మాట్లాడుతున్న అసదుద్దీన్ ఓవైసీ



ములుగు జిల్లా ఏటూరునాగారంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం



ఏటూరునాగారంలో తడిచిన మిర్చి

ఓ కాలమా.. ఇది నీ శాపమా..?!

అన్నదాతను ముంచేస్తున్న అకాల వర్షాలు

- కల్లాల్లోనే తడుస్తున్న ధాన్యం, మొక్కజొన్న, మిర్చి
- కాంటాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు లేక ఇబ్బందులు
- గన్నీబ్యాగులు, టార్పాలిన్‌లు, హమాలీలు, లారీలు లేక ఇక్కట్లు
- పంట విక్రయంలో ఉమ్మడి జిల్లా రైతాంగం అగచాట్లు

"యాసంగిలో ఓ రైతు ఐదు ఎకరాల్లో వరి సాగు చేశాడు.. కోతకు రావటంతో వరి ధాన్యాన్ని కోసి కొనుగోలు కేంద్రానికి తరలించాడు.. 17 శాతం తేమ వచ్చే వరకు కొనుగోలు కేంద్రంలో స్థలం లేక రోడ్డుపైనే ఆరబెట్టాడు. కాంటా సీరియల్ వచ్చే లోపే అకాలం వర్షం పడి ధాన్యం తడిసింది. మళ్లీ నాలుగు రోజులు ఎండబెట్టి శుక్రవారం కాంటా వేశాడు. కానీ, వెంటనే లారీలు లేకపోవటంతో మిల్లుకు ధాన్యాన్ని తరలించలేదు. ఇంతలోపే మళ్లీ భారీ వర్షం వచ్చి కాంటా వేసిన బస్తాలన్నీ తడిచిముద్దయ్యాయి. బస్తాల్లోని ధాన్యం మళ్లీ 17శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టాలని అధికారులు చెబుతున్నారు. దానికో వారం పదిరోజులు పట్టేలా ఉంది. ఇంతలో మళ్లీ వర్షం పడితే ఇక ఆగమాగమే.."

.. ఇది ఏ ఒక్క రైతు దీనగాథ కాదు.. వరి ధాన్యం సాగు చేసిన ప్రతీ రైతు ఎదు ర్కొంటున్న కన్నీటి కథ. ధాన్యం కొనుగో లు కేంద్రాల్లో రాత్రిళ్లు జాగారం చేస్తూ ధాన్యాన్ని విక్రయించుకునేందుకు కర్షకులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వడగళ్ల వాన నుంచి తేరుకోకముందే అన్నదాతలపై అకాల వర్షం పిడుగులా పడింది. ఐదారురోజులుగా కురుస్తున్న అకాలవర్షాలతో వరి ధాన్యాన్ని పండించిన రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇటీవల కాలంలో కురుస్తున్న వడగళ్ల వానకు రైతుల చేతికి వచ్చే పంట నీటిపాలవుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, జనగామ జిల్లాల్లో భారీగా పంటలు వడగళ్ల వానకు చేతికి అందుకుండాపోయాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నీటిపాలవుతుంటే అన్నదాత కళ్లలో నీటి సుడులు తిరుగుతున్నాయి.


తూకంలో తరుగు.. రైతుకు బరువు..

మార్కెట్‌కు తీసుకువచ్చిన వరిధాన్యాన్ని కాంటా వేసేందుకు 15-20 రోజులు వరకు నిరీక్షించాల్సి వస్తోంది. చాలా కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరత రైతులను వేధిస్తోంది. కొనుగోళ్ల నత్తనడకన సాగడానికి హమాలీలు, లారీలు, మిల్లర్లే ప్రధాన కారణంగా చెబుతున్నారు. తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అధికారులు కొర్రీలు పెడుతున్నారు. వానలకు రంగు మారటంతో ధాన్యాన్ని తీసుకునేందుకు మిల్లర్లు ముఖం చాటేస్తున్నారు. దీంతోపాటు తూకంలోనూ రైతును దగా చేస్తున్నారు. ప్రతీ బస్తాకు రెండు, మూడు కిలోల వరకు తరుగు పేరుతో తోడేస్తున్నారు. ఇక మిల్లులకు ధాన్యం చేరగానే తాలు, తేమ పేరుతో నాలుగైదు కిలోలు కోత పెడుతూ రైతు కష్టాలకు వాత పెడుతున్నారు. దీంతో రైతులు నిండా మునుగుతున్నారు.

కల్లాల్లో జాగారం..

కాంటాలు ఆలస్యం అవుతుండటంతో అకాల వర్షాలు రైతు శ్రమను మింగేస్తున్నాయి. ధాన్యాన్ని కాంటా వేసేది హమాలీలే కావటంతో వారు కొనుగోలు కేంద్రాల్లో సరిపడా లేకపోవటంతో రోజుల తరబడి ధాన్యంతో రైతులు కాంటా కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. అలాగే ధాన్యాన్ని మిల్లులకు

మిగతా 4వ పేజీలో...



భారీగా నష్టం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024-25 యాసంగిలో మొత్తం 6,60,699 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. వీటిలో 2,46,802 ఎకరాల్లో వరి, 18,958 ఎకరాల్లో మొక్కజొన్న, 9,26,459 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు. కాగా, భూగర్భ జలాలు ఎండిపోవటంతో సుమారు 50వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. దీంతో రైతులు ఎకరాకు రూ.25వేల వరకు పెట్టుబడి నష్టపోయారు. దీంతో పాటు మార్చి 21 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు రైతులపై అకాల వర్షాలు విరుచుకుపడుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాల్లో సుమారు 12వేల ఎకరాల్లో పంట నష్టంవాటిల్లగా, అత్యధికంగా ములుగు జిల్లాలో అకాల వర్షాలకు 5,723 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. సుమారు రూ.5.66కోట్ల వరకు నష్టంవాటిల్లినట్లుగా అధికారులు అంచనా వేశారు.

20 రోజులుగా కొనుగోలు కేంద్రంలో పడిగాపులు



ఎం.డి. దావూద్, రైతు, ఏటూరునాగారం

ఏటూరునాగారం మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రంలో 20రోజులుగా ధాన్యం నిల్వ ఉంటోంది. కొనుగోలు చేయకపోవటంతో అకాల వర్షాలకు ధాన్యం తడుస్తోంది. దాన్ని మళ్లీ ఆరబెట్టి తేమ శాతం రాగానే అమ్మకానికి వెళ్లితే కొనుగోలు కోసం నిరీక్షించాల్సి వస్తోంది. ఈ క్రమంలో గత గురువారం వర్షానికి మళ్లీ ధాన్యం తడిచాయి. ఇలా 20 రోజులు గడుస్తున్నప్పటికీ కాంటా మాత్రం కావటం లేదు. ఇంటికి వెళ్లకుండా ఎప్పుడు వర్షం వస్తుందో అనే భయంతో ధాన్యానికి కాపలాగా రాత్రిళ్లు జాగారం చేస్తున్నాం.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- నాయిని ట్రస్ట్ సేవా కార్యక్రమాలు అభినందనీయం
- ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ యువతను ప్రోత్సహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తన కుమారుడు విశాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ట్రస్టు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఆదివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నాయిని టీ-10 లీగ్ సీజన్-2 క్రికెట్ పోటీలను వేం నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులతో సరదాగా కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కుమారుడు 2015లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందినప్పటి నుంచి ఆయన పేరుమీద ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప విషయమన్నారు. గత పాలకుల హయాంలో కుంటుపడిన గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. క్రికెట్‌తో పాటు కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, టెన్నిస్‌ను మరింత అభివృద్ధి చేసేలా ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుందన్నారు. 2030 నాటికి ఒలంపిక్ క్రీడలను తెలంగాణలో నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నాయిని టీ-10 లీగ్‌కు 100కు పైగా టీమ్‌లు పేర్లు నమోదు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ టోర్నీ విజేత జట్టుకు రూ.లక్ష, రన్నరప్‌కు రూ.50వేలు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, నాయిని కుటుంబ సభ్యులు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న వేంనరేందర్‌రెడ్డి

ప్రజాస్వామ్య గొంతులను నొక్కుతున్న కేంద్రం

- ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఎల్కతుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య గొంతులను కేంద్ర ప్రభుత్వం నొక్కుతూ కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ వేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో మండల పదో మహాసభను సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు కామెర వెంకటరమణ, మర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల రాయితీలను ప్రకటిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. పేదల సంక్షేమం కోసం ప్రశ్నించిన గొంతులను అణచివేస్తోందన్నారు. రాజ్యాంగాన్ని కాలరాస్తూ రచయితలు, కవులు, కళాకారులు, విద్యావేత్తలను అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నారని విమర్శిం చారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో పేదలకు విద్య, వైద్యం అందకుండా పోతోందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు ఆదరి శ్రీనివాస్, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, రాజ్‌కుమార్, మనోహర్, చంద్రమౌళి, రాజనర్సు, కుమారస్వామి, మోహన్‌రెడ్డి, విజయ్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి


ఈటల రాజేందర్‌తో మాట్లాడుతున్న భూ బాధితులు

ఎంపీ ఈటలను కలిసిన భూ బాధితులు

సంగెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు కోల్పోతున్న రైతులు ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆదివారం కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. షామీర్‌పేటలో ఉన్న ఎంపీని కలిసి నాగపూర్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ నిర్మాణం కోసం మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కలిసి భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ రేటుకంటే తక్కువగా ఇస్తూ తమకు తీరని అన్యాయం చేస్తున్నారని రైతులు ఆవేదనతో తెలిపారు. మార్కెట్ రేటులో కనీసం 20శాతం నష్టపరిహారం అందించడంలేదని, భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేసే విధంగా సహకారం అందించాలని కోరినట్లు బాధిత రైతులు తెలిపారు. ఈ విషయంపై ఈటల స్పందించి భూమలు కోల్పోతున్న రైతులకు తగిన న్యాయం చేసేందుకే పార్లమెంటులో ప్రస్తావనకు తెచ్చినట్లు ఆయన గుర్తుచేశారు. ఈ విషయంపై ప్రభుత్వ దృష్టికి తీసుకరానున్నట్లు ఆయన హామీ ఇచ్చారని రైతులు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రఘుపతి, ఎస్సై, ఖానాపురం

ఫటా ఫట్



ఆంధ్రజ్యోతి : క్రైమ్ రేటు తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎస్సై : మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతి భద్రతలు పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : డ్రంకెన్ డ్రైవ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా?

ఎస్సై : ప్రతి రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: సైబర్ క్రైమ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

ఎస్సై : సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. స్మార్ట్ ఫోన్లు ఉన్నవారు ఈ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రజలను చైతన్య పరుస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో చోరీలు జరుగకుండా ఎలాంటి నిఘా ఉంచుతున్నారు?

ఎస్సై : రాత్రి వేళల్లో గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ఎండా కాలం కావడంతో పాఠశాలలకు సెలవులు ఉంటాయి. దీంతో పిల్లలతో కలిసి కుటుంబాలు విహారయాత్రకు గానీ, బంధువుల ఊర్లకు గానీ వెళ్లే సమయంలో వారి వివరాలు పోలీస్ స్టేషన్‌లో తెలిపితే వారున్న ఇంటి ఏరియాలో నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడే యువతకు మీరిచ్చే సందేశం?

ఎస్సై : ఈజీగా డబ్బు సంపాదించాలని ఆన్‌లైన్ గేములు ఆడి రూ. లక్షలు పోగొట్టుకునే యువత, ఒక్కసారి తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు చేసుకుంటే కష్టం విలువ తెలుస్తుంది.

- ఖానాపురం (ఆంధ్రజ్యోతి)

భూ భారతికి విశేష స్పందన

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన వర్ధన్నపేట
- మండలంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు
- భూ సమస్యలపై 2917 దరఖాస్తులు
- జూన్ 1వ తేదీలోగా పరిష్కరించేలా ప్రాణాళికలు

వర్ధన్నపేట/వర్ధన్నపేట రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న భూ భారతి చట్టం అమలు కోసం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన వర్ధన్నపేట మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు అనూహ్య స్పందన లభించింది. ఈ నెల 5న ప్రారంభమైన ఈ సదస్సులు 14వ తేదీతో ముగిశాయి. వివిధ భూ సమస్యలపై 2,917 మంది రైతులు అధికారులకు దరఖాస్తులను అందజేశారు. వీటిలో ప్రధానంగా మిస్సింగ్ సర్వే నంబర్, పీవోటీ, సాదాబైనామా తదితర సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను భూభారతి చట్టం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వాటి విచారణ త్వరితగతిన పూర్తిచేసి జూన్ 1వ తేదిలోగా పరిష్కరించనున్నారు.

రెవెన్యూ సదస్సులు

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద వర్ధన్నపేట మండలాన్ని ఎంపిక చేసింది. ఈ సదస్సుల నిర్వహణకు రెండు బృందాలను ఏర్పాటుచేసి మండల పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 5నుంచి 14వ తేది వరకు సదస్సులు నిర్వహించారు. ప్రతీ గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అక్కడే ఉండి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సదస్సులను కలెక్టర్ సత్యశారద, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి పర్యవేక్షణ చేశారు. పలు రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్, ఆర్డీవో స్వయంగా పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. రైతుల సమస్యలపై గ్రామాల్లో దరఖాస్తులు చేసుకోనివారికి సైతం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించారు. మండలంలో 2917 దరఖాస్తుల్లో సాదాబైనామా 1,415, అసైన్డ్ భూములకు సంబంధించి 746, మిస్సింగ్ సర్వే నంబర్ 30, పెండింగ్ మ్యుటేషన్ 32, డీఎస్ పెండింగ్ 45, భూ విస్తీర్ణంలో తేడాలు సరిచేయడం 155, భూ వివరణ, స్వభావం మార్పు 18, పట్టాదారు పేరు తండ్రి, భర్త పేరు సవరణ 4, నిషేధిత జాబితా నుంచి తొలగించడం 1, ఇనామ్ - ఓఆర్‌సీ జారీ చేయడం 28, 38-ఈ ధ్రువపత్రం కోసం 1, వారసత్వ భూ మార్పిడి 192, భూ సేకరణకు సంబంధించి 5, ఇతరాలు 241లు ఉన్నాయి.

భౌగోళిక పరిస్థితి

వర్ధన్నపేట మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు, ఒక మున్సిపాలిటీ ఉంది. వర్ధన్నపేటతో కలిపి 12 రెవెన్యూ గ్రామాలున్నాయి. మండల విస్తీర్ణం మొత్తం 37,469 ఎకరాలు కాగా, అందులో 32,773 ఎకరాల సాగు చేసే విస్తీర్ణం ఉంది. దాదాపు పది వేలకు పైగా సర్వే నంబర్లు, 17,694 ఖాతాలు ఉన్నాయి. రైతులు సైతం 17,694 మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి.

గ్రామాల వారిగా వచ్చిన దరఖాస్తులు

వర్ధన్నపేట మండల వ్యాప్తంగా 12 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వాటిలో బండౌతపురం 68, కొత్తపెల్లి 81, ఉప్పరపెల్లి 122, దివిటిపెల్లి 54, ఇల్లంద 305, కట్ర్యాల 280, చెన్నారం 167, నల్లబెల్లి 467, ల్యాబర్తి 125, దమ్మన్నపేట 321, రామవరం 111, వర్ధన్నపేట 816, మొత్తం మండల వ్యాప్తంగా ఈ నెల 17 వరకు 2917 దరఖాస్తులు రైతుల నుంచి రెవెన్యూ అధికారులకు వచ్చాయి. వీటిలో సాదాబైనామా కింద 1,415 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తర్వాత అసైన్డ్ భూములకు సంబంధించి 746 రాగా, వారసత్వం భూ మార్పిడి సమస్యలంటూ 192, భూ విస్తీర్ణంలో తేడాలు సరిచేయడానికి 155 దరఖాస్తులు మండల వ్యాప్తంగా వచ్చాయి.

మూడు టీంలుగా క్షేత్రస్థాయిలోకి...

భూ భారతి పైలెట్ ప్రాజెక్టులో భాగంగా క్షేత్రస్థాయి పరిశీలన కోసం వర్ధన్నపేట మండలం నుంచి మూడు టీంలు దరఖాస్తుల పరిష్కారానికి


భూ సమస్యలపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద (ఫైల్)

పనిచేస్తున్నాయి. ఒక్కో టీంలో డీటీ (డిప్యూటీ తహసీల్దార్) స్థాయి అధికారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు ఈ టీముల్లో పని చేస్తున్నారు. వీరికి సర్వే నంబర్ల వారీగా దరఖాస్తులను విభజించి క్షేత్రస్థాయిలోకి పంపిస్తున్నారు. రైతులతో మాట్లాడి ఫీల్డ్ విచారణ చేసి తదుపరి నివేదికను తహసీల్దార్‌కు అందిస్తారు. దానిలోని సాధ్యసాధ్యాలను చూసి తహసీల్దార్, కలెక్టర్‌ను సంప్రదించి సమస్య పరిష్కారానికి మార్గం చూపేలా పనిచేస్తున్నారు. జఠిలమైన సమస్యల పట్ల సైతం రెవెన్యూ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వీటిల్లో భూ విస్తీర్ణ పంచాయతీలు అధికారులకు సవాల్‌గా మారాయి. సర్వే చేయాల్సిన భూములను సైతం సమస్యలు పరిష్కరించాలంటే ఈ కొద్ది సమయంలో ఇబ్బందులు తప్పేలా లేవు.

సమస్యలపై దృష్టి సారించాం...

విజయ్ సాగర్, తహసీల్దార్ వర్ధన్నపేట

మండల వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటికే 26 నోటీసు చేశాం. వాటిలో 24 ఆమోదించి, ఒకటి తిరస్కరించడం జరిగింది. జూన్ 2 వరకు సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తాం. మా టీంలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా ఇంకా ఎవరైన దరఖాస్తు చేసుకోని యెడలా వాటిని కార్యాలయంలో ఇవ్వొచ్చు. అధికారులే మీ చెంతకు వచ్చి మీ భూ సమస్యలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపుతారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యలు లేని మండలంగా వర్ధన్నపేటను చేసేందుకు కృషి చేస్తాం.

ధాన్యం సేకరణలో జాప్యం చేయొద్దు

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద**

నర్సంపేట టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. నర్సంపేట మండలం మగ్దుంపురం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, ధాన్యం సేకరణను నిశితంగా పరిశీలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా, ధాన్యం అమ్మకాల వివరాలతో కూడిన రశీదులు ఇస్తున్నారా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి కిష్టయ్య, జిల్లా మేనేజర్ సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

- **కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ సంఖ్యను పెంచాలి**

నెక్కొండ (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తీసుకొచ్చే వరి ధాన్యం తడిసే ప్రమాదం ఉన్నందున హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం నిలువలేకుండా కాంటాలు పెంచి వెంటనే రవాణా చేయించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆదేశించారు. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన భాగ్యలక్ష్మి వరిధాన్యం కొనుగోలు సెంటర్‌ను ఆమె ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం విక్రయించడానికి వచ్చిన రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వహకులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఆదేశాలు జారీచేశారు. వడగళ్ళ వర్షం, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడుతున్న సమయంలో రైతులు, హమాలీలు చెట్ల కింద కాకుండా సమీపంలోని గదులలో ఉండాలని సూచించారు. ధాన్యం డబ్బులు వెంటనే రైతుల బ్యాంక్ అకౌంట్లలో పడేలా నిర్వహకులు చర్యలు తీసుకోవాలన్నారు. వరి ధాన్యం శుభ్రపర్చుటకు రైతులు పాడి క్లీనర్లు ఉపయోగించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీఏవో అనురాధ, డీఎంవో సురేఖ, డీసీవో నీరజ, డీసీఎస్‌వో కిష్టయ్య, డీఎం సంధ్యారాణి, ఏడీఆర్‌డీవో రేణుకాదేవి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏవో నాగరాజు, ఏపీఎంలు శ్రీనివాస్, సుధాకర్, సీసీ రవీందర్, ఏఈవో వసంత, సెంటర్ల ఇన్‌చార్జ్‌లు సుమత, సరిత, సతీష్, రైతులు పాల్గొన్నారు.

- **ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయండి**

చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌లతో పాటు పాపయ్యపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తీసుకవచ్చిన ధాన్యంలో మ్యాచ్యర్ శాతంను పరిశీలించి కాంటాలను చేయాలన్నారు. రైతులు తప్పకుండా ధాన్యాన్ని శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తమ ధాన్యం కొనుగోలు సెంటర్‌లో టార్పాలిన్ కవర్‌లను రాత్రి సమయంలో దొంగతనం చేస్తున్నారని సెంటర్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కొనుగోలు సెంటర్‌లో హమాలీలు తక్కువగా ఉండడంతో కాంటాలు కావటం లేదని అధికారులకు రైతులు తెలిపారు. సెంటర్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సెంటర్ నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్‌వో డి.క్రిష్టయ్య, సివిల్ సప్లయి


చెన్నారావుపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్యశారద

డీఎం సంధ్యారాణి, సివిల్ సప్లయి డీటీ సంధ్య, ట్రేని ఎస్సై చిలువేరు రోహిత్, తహసీల్దార్ ఫణికుమార్, ఆర్ఐ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

- **కొనుగోలు కేంద్రంలో వసతులు ఏర్పాటు చేయాలి**

సంగెం (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులకు అన్ని వసతులు కలిపించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద చెప్పారు. ఆదివారం మండలంలో కాపులకనపర్తి సొసైటీలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం నిర్వహకులతో ఆమె మాట్లాడారు. వరిధాన్యాన్ని తీసుకొచ్చే రెతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత నిర్వహకులు తీసుకోవాలన్నారు. సొసైటీ పరిధిలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావల్సిన గన్నీలఃమునన అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన వరిధాన్యాన్ని నిలువ ఉంచకుండా వెనువెంటనే కేంద్రానికి కేటాయించిన మిల్లులకు తరలించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీవో ఎం.నీరజ సివిల్ సప్లై డీఎం సంధ్య, డీఎస్‌వో కిష్టయ్య, సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్, సొసైటీ సీఈవో రమణాచారి, సిబ్బంది మాలతి, భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

గీసుగొండ, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాంపురం, గీసుగొండలో ఆదివారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలాధారణ స్వాములు వాహనంలో భారీ హనుమాన్ విగ్రహాన్ని పెట్టి ఊరేగింపుగా శోభాయాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు, మహిళలు హనుమాన్ విగ్రహానికి భక్తిశ్రద్ధలతో మంగళహారతులతో స్వాగతం పలికారు. మాలధారణ భక్తులు హనుమాన్ చాలీసా పటిస్తూ పాదయాత్ర చేశారు.

జమాయిల్ తోట దగ్ధం

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామ శివారులో కరిమిల్ల సోమేశ్వర్‌కు చెందిన జమాయిల్ తోట ఆదివారం నిప్పంటుకొని దగ్ధమైంది. పక్కన ఉన్న రైతు వరి కొయ్యాలకు నిప్పుపెట్టారు. దీంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న 15 ఎకరాల జమాయిల్ తోటలో 12ఎకరాల జమాయిల్ తోట పూర్తిగా అగ్నికి దగ్ధమైంది. దీంతో రూ.30లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు సోమేశ్వర్‌రావు కన్నీళ్లపర్యంతమయ్యాడు.

బాధిత కుటుంబానికి పరామర్శ


శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), మే 18 (ఆంధ్రజ్యోతి) : పర్వతగిరి మండలంలోని వడ్లకొండకు చెందిన పర్వతగిరి మండల సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ కట్టా శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అదివారం శ్రీనివాస్ దశదిన కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పాల్గొని మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరమర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వం తరుపున అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రేవతికుమరస్వామి, కాంగ్రెస్ నాయకులు బుద్ద పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆరెపల్లికి చెందిన లకిడే మధురాబాయి, నాగూర్ల బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాలను ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. ధర్మారెడ్డి వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, నాయకులు ఉన్నారు.


● సంగెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకుడు అల్లం భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలుసుకుని మృతుని గ్రామానికి వెళ్లి మృతదేహనికి పూల మాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించి వారిని ఓదార్చారు. ఆయన వెంట నల్గొండ జిల్లా బీఆర్ఎస్ నాయకురాలు శరణ్యరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సారంగపాణి, మండల నాయకుడు పూజారి గోవర్దన్, మధుసూదన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు కన్నీళ్లు


రైతులతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట రూరల్ (పర్వతగిరి), మే 18 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి తోడు అకాల వర్షాలతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అదివారం మండలంలోని చింత నెక్కొండ, కొంకపాక గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. రోజుల తరబడి ధాన్యం కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తూ దయనీయ స్థితిలో ఉన్నారన్నారు. సాగునీరు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తూకాలు వేయడం, తూకం వేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించడం, బోనస్ అందించడంలో ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందిందన్నారు. ఈదురు గాలులు, అకాల వర్షాలతో రైతులు దినదిన గడంగా గడుపుతుంటే ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ రైతు డిక్లరేషన్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జామ చేస్తామని హామీ ఇచ్చారని, రైతులు అమ్మిన ధాన్యానికి పది రోజులలోపు జమ కావడంలేదని, దీంతో వర్షాకాలం ముంచుకు రావడంతో దుక్కులు దున్నడానికి ఎరువుల, విత్తనాలు కొనుగోలు చేయాడానికి వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు మొండ్రాయి విద్యార్థులు


ప్రణయ్‌వర్ధన్


వర్షిత్

సంగెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ జూనియర్ పోటీలకు మొండ్రాయి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, పీడీ ముఖర్జీలు తెలిపారు. గత నెల 30 వరంగల్‌లోని ఓసీటీలో జరిగిన ఎంపికలో అత్యంత ప్రతిభ కనబర్చి ఈ నెల 19 నుంచి 21 వరకు మెదక్ జిల్లా తూర్పాన్‌లో 11వ రాష్ట్ర స్థాయిలో జరిగే జూనియర్ పోటీలకు బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన ప్రణయ్‌వర్ధన్, వర్షిత్‌లు ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

పొదుపుతోనే కుటుంబాల ఆర్థికాభివృద్ధి


తిమ్మంపేటలో మాట్లాడుతున్న రత్నాకర్‌రెడ్డి


ఈశ్వర్‌రెడ్డి

దుగ్గొండి, మే 18 (ఆంధ్రజ్యోతి) : పొదుపుతోనే ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమని పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు తోకల రత్నాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిమ్మంపేటలోని చైతన్య పురుషుల సంఘం 26వ వార్షికోత్సవ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం 99 మందితో ఏర్పడి, నేడు 609 మందితో కోటి రూ.32లక్షల ఆర్థిక లావాదేవీలతో ముందుకు పోవటం జరుగుతుందన్నారు. కుటుంబం ఆర్థికంగా ఎదగడానికి పొదుపు ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా చైతన్య పురుషుల సంఘం నూతన అధ్యక్షుడిగా హనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షుడిగా కోరం చంద్రమోహన్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా కంచన రాజేంద్రప్రసాద్, శ్రీరాముల ప్రశాంత్, ఈదుల నవీన్, మామునూరు విగ్నేష్వర్, కొమురవెల్లి, నల్లగొండ కోటి, షరీఫ్, కూనూరు సతీప్, ఎలకంటి కుమారస్వామి, నమిండ్ల రమేష్‌లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అనుమాండ్ల ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి): పొదుపుతోనే ఆర్థికంగా అభివృద్ధిని


చెన్నారావుపేటలో మాట్లాడుతున్న కుమారస్వామి


సుధాకర్

సాధిస్తామని పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు నునే కుమారస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రమశక్తి పురుషుల సంఘం 25వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి కోసం ప్రతీ సభ్యుడు కృషి చేయాలన్నారు. కుటుంబ అవసరాలకు పొదుపు ఎంతో అవసరమన్నారు. తక్కు వ వడ్డీతో ఆర్థికావసరాలకు ఎంతో దోహదం చేస్తా యన్నారు. ఈ సందర్భంగా శ్రమశక్తి పురుషుల సంఘం నూతన అధ్యక్షుడిగా సూత్రపు సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా దొంతి సాయిలు, డైరెక్టర్‌లుగా మెంతుల రమేష్, తౌటి రవి, సూర రంజిత్, పులి రమేష్, సిద్ద కుమారస్వామి, శంకేషి రంజిత్‌కుమార్, జెట్టబోయిన వీరభద్రయ్యలను ఎన్నుకున్నారు. అనంతరం సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు కంది చిన్నమల్లారెడ్డి, కుతూరు ఇంద్రారెడ్డి, పత్తి అనంతరెడ్డి, దొనికల వీరభద్రయ్య, కంది అశోక్‌రెడ్డి, తాల్లపెల్లి కొమ్మాలు, ముత్యం సాంబయ్యలను ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గౌడ విద్యార్థుల దరఖాస్తుల ఆహ్వానం

సంగెం, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో గల పలు గ్రామాలకు చెందిన పదో తరగతి, ఇంటర్‌లలో అధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు ఘన సత్కారం చేయనున్నట్లు వరంగల్ జిల్లా గోపా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో 9.5 గ్రేడ్, ఇంటర్ రెండో సంవత్సరంలో 950 మార్కులు సాధించిన గౌడ కులస్థుల పిల్లలకు ప్రతిభ పురస్కారంతో పాటు నగదు పారితోషికాన్ని అందజేస్తామన్నారు. విద్యార్థులు మార్కుల మెమో, కుల, ఆధార్ కార్డులను పోచమ్మ మైదాన్ ప్రాంతంలో గల డాక్టర్ బీఎల్ఎన్ కేర్ హాస్పిటల్‌లో అందజేయాలని, పూర్తి వివరాలకు ఫోన్ 82473 64241, 99494 61658 సంప్రదించాలని చెప్పారు. ఈ నెల 25న హంటర్ రోడ్‌లో గల గోపా భవనంలో పురస్కారాలు అందించబడతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ గోపా ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొమ్మెర కుమారస్వామిగౌడ్, నాయకులు సట్ల కిరణ్‌కుమార్‌గౌడ్, డాక్టర్ తాళ్ల రవిగౌడ్, ప్రకాష్‌గౌడ్, తాబేటి వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.